# పరీక్ష

వరంగల్ నుండి మీ అమ్మా, నేనూ పెళ్ళి చూపులకు డైరెక్ట్‌గా వస్తాం. నవ్వక్కడినుండి అటేరా అమ్మాయిని మేము ఓ పెళ్ళిలో చూశాం. చక్కని చుక్క కడిగిన ముత్యం ఎమ్మే చదివిందట నీకున్నట్టే ఆమెకూ... తనకు నచ్చిన వారినే పెళ్ళాడాలనుందట అమ్మాయి నీకు నచ్చి తీరుతుంది. నీ ఫోటో పంపించాం. ఆమెకు నువ్వు నచ్చితే అక్కడి కక్కడే తాంబూలాలు పుచ్చుకుందాం"

నాన్న ఉత్తరాన్నందుకుని సికిందరాబాద్‌లో బస్సెక్కి సిద్ధిపేటకొచ్చాడు శ్రీకాంత్. ఎవరో తరుముకొస్తున్నట్టు పరుగెత్తుకొచ్చి కనబడిన ఆటో ఎక్కేశాడు

"శంకర్‌నగర్ పోనీ. ..!"

జెట్ విమానంలా దూసుకెళ్ళింది ఆటో.

... బస్సులో .... ఆ జవరాలెవరో...! బస్సెక్కగానే తన పక్కన కూచుంది .... చేసుకున్న పెళ్ళాంలా... బస్సుకదిలిందో లేదో జరిగి దగ్గరకొచ్చింది. తాను కిటికీ వైపు జరిగాడు. ఆమె గూడా జరిగింది తననే చూస్తోంది.

పాలలో కుంకుమ కలిపిన దేహఛాయ చెవులరింగుల తళుకులు చెక్కిళ్ళమీద మెరుస్తున్నాయి బంగారు తీగల్లాంటి చేతి వేళ్ళను తన భుజమ్మీదానిస్తూ

"మీ పేరేమిటో!" అడిగింది దొండపండు పెదవిని మునిపళ్ళతో పిండేస్తూ తన నరాల్లో సంచలనం తనపేరు చెప్పేశాడు నవ్వాలని ప్రయత్నిస్తూ

"అలాగా నాపేరు వరూధిని, మీపేరు ప్రవరాఖ్యుడనుకున్నాను సుమా!" గలగలా నవ్వుతూ మరింత జరిగింది

భుజాలు రాసుకుంటున్నాయి శ్రీశైలం జలపాతంలా తనలో ఏదో అలజడి. ఎడమచెవి రింగు తన కుడిచెంపకు చల్లగా తగిలింది అరచెయ్యి పెదాల కానించి మరోసారి నవ్వింది

పిల్లకాదు ..... పిడుగులాగుంది. ముక్కుపుల్ల మెరిసింది

మీరు కొంచెం జరిగితే .! బలవంతాన నవ్వాడు అరచేతులంతటి ఆవిడ కళ్ళు ఏనుగు చెవులంతైనై.

"హబ్బా. ఏమైందటా!" జబ్బ మీద గిల్లింది. ఏమంటే ... ఏమంటుందో.. నాలుక కదల్లేదు. ఆటో అంబేద్కర్‌నగర్ దాటింది.

.. బస్సు ప్రజ్ఞాపూర్‌లో ఆగింది. టీ తాగి వచ్చేసరికి. కిటికీకి వీపు ఆనించి సీటుమీద కాళ్ళు బార్లాజాపి ధనుస్సులా కూచునుంది. జారిన పైటను పట్టించుకోవడం లేదు. గుండెలు కవ్విస్తున్నై.

ముందు సీటు యువకుడికేవో సైగలు చేస్తోంది. కవ్వింపు తనలో కలకలం రేపింది. నాలుక తడారి పోయింది. బస్సు కదిలింది.

"నేను కూచోవాలి...!" ఆ మాత్రం అనగలిగాడు. చటుక్కున తల ఎత్తింది. అదో రకంగా పెదాలాడించింది.

"కూచోవాలా . సరే !" మూతి మూడొంకర్లు తిరిగింది వెంటనే లేచి సైగలందుకున్న యువకుని పక్కన చేరింది బస్సు పరుగందుకుంది. వాళ్ళ ముచ్చట్లూ, పకపకలూ, వికవికలూ అబ్బో తన కళ్ళూ చెవులూ వాళ్ళ చుట్టే తిరిగినై

"శంకర్‌నగరొచ్చింది సార్!" చెయ్యిజాపాడు ఆటోవాలా

అమ్మా నాన్నలు అప్పటికే వచ్చేశారు పెళ్ళిచూపులకు ముందు . విదేశాల్లో పెళ్ళిల్లూ దేశ రాజకీయాలూ ముచ్చట్లలో కరిగిపోయినై

"అదో . అమ్మామొస్తుందిరా! మాలక్ష్మిలాగుంది పేరు పల్లవి. శ్రీకాంత్ చెవిలో ఊదింది తల్లి

గులాబీ రంగు చీర ఆకుపచ్చ పూవుల అంచు. అదే రంగు జాకెట్టు...

ఓహ్ .. బ్యూటీ ఫ్లవర్! అచ్చం దేవకన్యలాగుంది. నా కలల పాటకు పల్లవి . ఆమెనే,కదిలే ఆమని మనసు ఊయలలూగింది

రాయంచలా నడిచొచ్చి ఫలహారాలందించింది శ్రీకాంత్ కళ్ళలోకి చిలిపిగా చూసింది. ముసి ముసి నవ్వులతో గిలిగింతలు పెట్టింది. అమ్మాయి తనకు నచ్చిందని అమ్మా నాన్నలకు చెప్పేశాడు. సైగలతో. అలవోకగా కూచుంది. పల్లవి అందాలన్నీ కుప్పబోసినట్టుంది.

"ఇంకేమైనా పరీక్షలున్నాయా?" లోపలినుండి వచ్చి అడిగిందో యువతి. . పల్లవి పక్కన కూచుంటూ.

ఈమె... ఆమె వరూధిని.. ఇక్కడెందుకుంది? వెంటనే అడిగేశాడు.

"మీరా వరూధిని గారూ!"

"ఔను. నేనే శ్రీకాంత్ గారూ! మీరు నాక్కాబోయే భర్త ఫణిభూషణ్ గారు బస్సులో సైగలందుకొన్న యువకుణ్ని పరిచయం చేస్తోంది.

"ఏమిటిదంతా?" లేవబోయాడు

"కూచోండి శ్రీకాంత్ గారూ! మీరు నాకు బాగానచ్చారు." పల్లవి మాట వీణమీటినట్టుంది

"పల్లవి వరూధినులు అక్కా చెల్లెళ్ళ సంతానమండీ" ఫణిభూషణందుకున్నాడు. శ్రీకాంత్ బుద్ధిని పరీక్షించే బాధ్యత పల్లవి, వరూధిని కప్పగించింది. వరూధిని హైదరాబాదులోనే ఉంటుంది బస్సులో మిమ్మల్ని పరీక్షించింది. మీకు ఫస్ట్ మార్క్ వేసింది.

అందరి మొహాలు మిట్ట మధ్యాహ్నం ప్రొద్దుతిరుగుడు పూవులా విచ్చుకున్నాయి.

"మా అమ్మాయి సాహసాన్ని మీరు మరోలా భావించొద్దు బాబూ!" పల్లవి తండ్రి శ్రీకాంత్ చేతులు పట్టుకుని బతిమాలాడు.

"ఏదో చిన్నపిల్ల ...." తల్లి ఆరాటం.

"క్షమించండి శ్రీకాంత్ గారూ!" పల్లవి చేతులు జోడించింది. ఎంతటి ధన హీనుడినైన భర్తగా స్వీకరించగలను. గాని గుహహీనుడిని మాత్రం భరించలేను."

రోజులు మారాయి గదూ!" గుండెల నిండా నవ్వుకున్నాడు శ్రీకాంత్.

(అమృత్ కిరణ్ - 1-5-1995)

